జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

## భద్రాద్రి కొత్తగూడెం

శనివారం | 17 | జనవరి | 2026 ◆ పేజీలు : 6

## కనులపండువగా భద్రాద్రి రామయ్య రథోత్సవం



**భద్రాచలం, జనవరి 16, ప్రజాజ్యోతి :** శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దేవస్థానంలో మకర సంక్రాంతిని పురస్కరించుకుని గురువారం రాత్రి రథోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన రథంలో స్వామివారి ఉత్సవ మూర్తులను ఆశీనులుగా చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రధాన ఆలయం నుంచి తాతగుడి సెంటర్ లోని గోవిందరాజు స్వామి ఆలయం వరకు తిరువీధి సేవ నిర్వహించారు. ఈ సందర్భంగా తమ ఇంటి ముందుకు వచ్చిన స్వామివారి దర్శనానికి భక్తులు నీరాజనం పలికారు. పూలు, పండ్లు, హారతులు సమర్పించి భక్తిశ్రద్ధలు చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఈఓ కె. దామోదర్ రావు

మిగతా 2 లో...

- రోడ్డు ప్రమాదాలకు చెక్ పెట్టే ప్రయత్నం
- వేగం కాదు... భద్రతే ముఖ్యమని సందేశం
- జిల్లావ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు
- యువత, ద్విచక్ర వాహన దారులపై ప్రత్యేక దృష్టి
- భయంతో కాదు... బాధ్యతతో డ్రైవింగ్ కు పిలుపు
- తెలంగాణ పోలీస్ శాఖ అధ్వర్యంలో నూతన కార్యక్రమం




3 లో..

# అరైవ్... అలైవ్

### రోడ్డు భద్రతకు కొత్త పిలుపు

గమ్యానికి చేరుకోవడం కాదు.. జీవంతో చేరుకోవడమే అసలైన విజయం అనే నినాదంతో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఓ నూతన కార్యక్రమం కొనసాగుతోంది . రోడ్డు మీద రోజూ జరుగుతున్న ప్రమాదాలు ఎన్నో కుటుంబాలను శాశ్వతంగా కుదిపేస్తున్న నేపథ్యంలో, ప్రజల ప్రాణాలే కేంద్రంగా తెలంగాణ పోలీస్ శాఖ **'Arrive... Alive'** పేరుతో వినూత్న అవగాహన కార్యక్రమాన్ని ప్రారంభించింది. వేగం కాదు, భద్రతే ముఖ్యం అన్న సందేశాన్ని ప్రజల్లో బలంగా నాటడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం.

● భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ప్రజాజ్యోతి

## 52 మంది మావోయిస్టుల లొంగుబాటు

- లొంగిపోయిన వారిలో 21 మంది మహిళలు ,31 మంది పురుషులు
- లొంగిపోయిన మావోయిస్టులపై 1.41 కోట్ల రివార్డ్




**చర్ల, జనవరి 16: (ప్రజాజ్యోతి ):** ఛత్తీస్ గఢ్ లోని బీజాపూర్ లోని భద్రతా దళాలు నక్సలైట్ ఫ్రంట్ లో పెద్ద విజయాన్ని సాధించాయి. దళాలు తీసుకున్న నిరంతర చర్య ప్రభుత్వం ప్రతిష్టాత్మకమైన "నియాద్ నెల్లనార్" (పునరావాసం )పథకం ద్వారా ప్రభావితమై, డి వి సి ఎం (డివిజనల్ కమిటీ సభ్యుడు )తో సహా మొత్తం 52 మంది నక్సలైట్లు పోలీసులకు లొంగిపోయారు. లొంగిపోయిన వారిలో 21 మంది మహిళలు 31 మంది పురుష మావోయిస్టులు ఉన్నారు. వారందరిపై మొత్తం ₹1.41 కోట్ల రివార్డును ప్రకటించారు. పోలీసు అధికారుల ప్రకారం, లొంగిపోయిన 52 మంది మావోయిస్టులు కాల్పులు, ఐ ఈ డి పేలుళ్ల దహనం వంటి అనేక నక్సలైట్ సంఘటనలలో పాల్గొన్నారని తెలిపారు. ఈ నక్సలైట్లు

మిగతా 2 లో...

## ఇచ్చిన ప్రతి హామీ అమలు ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదే

- -పేద ప్రజల కోసం పని చేసే ఏకైక పార్టీ కాంగ్రెస్
- -గడపగడప కాంగ్రెస్ పార్టీ ప్రచారం
- -పూజలు చేసి ప్రారంభించిన ఎమ్మెల్యే



**ఇల్లందు, జనవరి 16, ప్రజాజ్యోతి:** గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీ అమలు ఘనత ప్రజల ఆశీర్వాదాలతో కొలువు తీరిన కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని ఎమ్మెల్యే కోరం కనకయ్య స్పష్టం చేశారు. శుక్రవారం మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా రెండో వార్డులో గల కాళీ మాత ఆలయం, అభయ అంజనేయ స్వామి ఆలయాలలో ఎమ్మెల్యే పూజలు నిర్వహించి గడపగడపకు కాంగ్రెస్ పార్టీ ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద ప్రజల కోసం పని చేసే ఏకైక పార్టీ కాంగ్రెస్ అన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వ పాలనకు, మన ప్రజా ప్రభుత్వ పాలనకు పురపాలక ప్రజానికం

మిగతా 2 లో...

## ఇచ్చిన ప్రతి హామీ అమలు ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదే

(మొదటి పేజీ తరువాయి...)

తేడా గమనించాలని కోరారు. అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు ఇచ్చామని, ఏ రాష్ట్రంలో అమలు చేయని పథకం ఉచిత సన్న బియ్యం ఇస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయడం జరిగిందని, మరో మూడేళ్లలో ఇదేవిధంగా ఇందిరమ్మ ఇండ్ల ప్రక్రియ కొనసాగుతూనే ఉంటుందని పేర్కొన్నారు. రాష్ట్రంలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ. 500 గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, మహిళలకు వడ్డీ లేని రుణాలతో అన్ని వర్గాల ప్రజలకు ఉపయోగపడే విధంగా అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టినట్లు తెలిపారు. ప్రజా ప్రభుత్వం ఇస్తున్న సంక్షేమ పథకాలను పార్టీ శ్రేణులు ప్రజల్లోకి తీసుకువెళ్ళాలని సూచించారు. మున్సిపల్ ఎన్నికల్లో అభ్యర్థి ఏవరైనా కానీ కాంగ్రెస్ పార్టీని గెలుపించాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే గడపగడపకు తిరుగుతూ కాంగ్రెస్ పార్టీని గెలుపించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బానోత్ రాంబాబు, పట్టణ అధ్యక్షుడు దొడ్డ డానియల్, సీనియర్ నాయకులు కోరం సురేందర్, మడుగు సాంబమూర్తి, మండల రాము, భోళ్ల సూర్యం, చిల్లా శ్రీనివాస్, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ యదలపల్లి అనసూయ, మాజీ వైస్ చైర్మన్ పులిగళ్ల మాధవరావు, హరిహర క్షేత్ర ఆలయ కమిటీ చైర్మన్ గందె సదానందం, నాయకులు జాఫర్, సుదర్శన్ కోరి, పింగళి నరేష్, మేకల శ్యామ్, ఇది గణేష్, గోచికొండ శ్రీదేవి, గోచికొండ సత్యనారయణ, పడిదల నవీన్, పత్తి రంజిత్, సర్పంచులు పాయం లలిత, పాయం స్వాతి, బానోత్ శారద, వల్లాల మంగమ్మ, మాజీ సర్పంచ్ కల్తీ పద్మ, కొండూరి నాగేష్, దండుగుల శివ, దాసు, పాయం ఆంజనేయులు, కాంగ్రెస్ పార్టీ మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## 52 మంది మావోయిస్టుల లొంగుబాటు




(మొదటి పేజీ తరువాయి...)

సి ఆర్ పీ ఎఫ్ డి ఐ జి దేవేంద్ర సింగ్ నేగి, పోలీసు సూపరింటెండెంట్ డాక్టర్ జితేంద్ర యాదవ్, అదనపు పోలీసు సూపరింటెండెంట్ ఉలాండన్ యార్క్, డి ఎస్ పీ శరద్ జైస్వాల్ మరియు డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ వినీత్ సాహు వంటి సీనియర్ అధికారుల ముందు లొంగిపోయారు. గణాంకాల ప్రకారం, 2024 నుండి 824 మంది మావోయిస్టులు లొంగిపోయారు, 1,126 మంది నక్సలైట్లను అరెస్టు చేశారు. ఇదిలా ఉండగా, భద్రతా దళాలు వివిధ ఎన్ కౌంటర్లలో 223 మంది మావోయిస్టులను హతమార్చాయి. పునరావాస విధానం ప్రకారం, లొంగిపోయిన తర్వాత నక్సలైట్లకు ఒక్కొక్కరికి 50,000 రూపాయల నగదు ప్రోత్సాహకం అందించబడింది. లొంగిపోయిన నక్సలైట్లకు పునరావాసం కల్పించడానికి జనజీవన స్రవంతిలోకి తిరిగి రావడానికి సాధ్యమైన అన్ని సహాయం అందిస్తామని పోలీసు అధికారులు తెలిపారు. మావోయిస్టులు తమ తప్పుదారి పట్టించే హింసాత్మక సిద్ధాంతాలను విడిచిపెట్టి, నిర్భయంగా సమాజంలోని జనజీవన స్రవంతిలోకి తిరిగి రావాలి. ప్రభుత్వ 'పూనా మార్గెం' విధానం వారి భవిష్యత్తు సురక్షితంగా, గౌరవప్రదంగా స్వావలంబనగా ఉండేలా చూసేందుకు సాధ్యమైన ప్రతి సౌకర్యాన్ని అందిస్తోంది" అని బీజాపూర్ పోలీసు సూపరింటెండెంట్ డాక్టర్ జితేంద్ర కుమార్ యాదవ్ మావోయిస్టులకు విజ్ఞప్తి చేశారు.

## కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వనమా గాంధీ నీ మంత్రి తుమ్మల పరామర్శ





**♦ శివాలయం చైర్మన్ మల్లెల నరసింహారావు కుటుంబ సభ్యులతో కలిసి మంత్రి తుమ్మలకు చిరు సన్మానం**

**అన్నపురెడ్డిపల్లి, జనవరి 16, ప్రజా జ్యోతి :** అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలో గల కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వనమా గాంధీ నివాసానికి వెళ్లిన తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఇటీవల అనారోగ్య సమస్యతో కేర్ ఆస్పత్రిలో చికిత్స పొంది ఇంటికి వచ్చిన వనమా గాంధీని పరామర్శించారు. ఈ సందర్భంగా వనమా గాంధీ ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకుని త్వరగా పూర్తిగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి ఆలయ చైర్మన్ మల్లెల నరసింహారావు కుటుంబ సభ్యులతో కలిసి మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు చిరు సన్మానం చేశారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, తుమ్మల అభిమానులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. అనంతరం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నపురెడ్డిపల్లి మండల ప్రజలందరికీ కనుమ పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తూ, అందరూ సుఖసంతోషాలతో ఆరోగ్యంగా జీవించాలని ఆకాంక్షిస్తూ రెండు నిమిషాల పాటు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో హరిహర ఫౌండేషన్ వ్యవస్థాపకులు మారగాని శ్రీనివాసరావు, పైడి వెంకటేశ్వర రావు, జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకుడు బానోతు భీముడు నాయక్, కాంగ్రెస్ పార్టీ మండల యువజన అధ్యక్షుడు వేముల నరేష్ బాబు, దోసపాటి రాంబాబు, యాదాల వెంకన్న, సుగ్గల నరసింహారావు, సర్పంచ్ లాకవత లక్ష్మీ, ఉప సర్పంచ్ మారగాని అశోక్, కటారి రాజబాబు తదితర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## సీఎం కప్ క్రీడలకు క్రీడాకారులు తప్పని సరిగా రిజిస్ట్రేషన్ చేయాలి


**♦ * జనవరి 20 నుంచి గ్రామ స్థాయి పోటీలు – మండల విద్యాశాఖాధికారి ఆనంద కుమార్ ప్రకటన**



**అన్నపురెడ్డిపల్లి, జనవరి 16, ప్రజా జ్యోతి :** అశ్వారావుపేట నియోజకవర్గం, అన్నపురెడ్డిపల్లి మండల పరిధిలో నిర్వహించనున్న సీఎం కప్ గ్రామ స్థాయి క్రీడా పోటీలలో పాల్గొనదలచిన క్రీడాకారులు తప్పని సరిగా ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని మండల విద్యాశాఖాధికారి ఉండేటి ఆనంద కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ క్రీడా పోటీలు జనవరి 20 నుంచి ప్రారంభమవుతాయని, అన్నపురెడ్డిపల్లి, ఎర్రగుంట ఉన్నత పాఠశాలల క్రీడా మైదానాలలో రెండు క్లస్టర్లుగా కబడ్డీ, ఖో ఖో, వాలీబాల్ పోటీలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో భాగంగా అన్ని గ్రామ పంచాయతీల్లో టార్చ్ ర్యాలీలు నిర్వహించాలని సూచించారు. ఈ ర్యాలీలను సర్పంచులు, వార్డు సభ్యులు, క్రీడాకారులు, ప్రజాప్రతినిధులు, విద్యాసంస్థలు, గ్రామస్తులు, అధికారులు, అనధికారుల సమన్వయంతో గ్రామ కార్యదర్శులు విజయవంతం చేయాలని మండల అభివృద్ధి అధికారి కావూరి మహాలక్ష్మి తెలిపారు. గ్రామ స్థాయి, మండల స్థాయి క్రీడల నిర్వహణకు క్లస్టర్ ఇన్‌చార్జులుగా ఉన్నత పాఠశాలల ఫిజికల్ డైరెక్టర్లు కృష్ణ, జయరాం వ్యవహరిస్తారని మండల విద్యాశాఖాధికారి పేర్కొన్నారు. క్రీడాకారులు తమ పేర్లను ప్రభుత్వ వెబ్‌సైట్ satg.telangana.gov.in లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.

## కనులపండువగా భద్రాద్రి రామయ్య రథోత్సవం

(మొదటి పేజీ తరువాయి...)



దంపతులు, ఏఈవో శ్రావణ్ కుమార్, ఆలయ పర్యవేక్షకులు లింగాల సాయిబాబా తదితరులు పాల్గొన్నారు. అలాగే శుక్రవారం స్వామి వారు స్వర్ణభద్ర కవచాలతో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర నిత్య పూజలు నిర్వహించారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం జరిపించారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోగపట్ట ధారణ గావించి నిత్యకల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు భారీగా హాజరై స్వామివారి దర్శనం చేసుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు

## రోడ్డు భద్రతే పండుగల ఆనందాలకు రక్షణ: సంగం వెంకట పుల్లయ్య

**భద్రాచలం, జనవరి 16, ప్రజాజ్యోతి:** "ఈ సంక్రాంతి పండుగ తెచ్చిన సంతోషాలు వచ్చే సంక్రాంతి వరకు ప్రతి కుటుంబంలో కొనసాగాలంటే రోడ్డు ప్రమాదాలు జరగకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వాహనాలు నడపాలి" అని భద్రాచలం మోటార్ వెహికల్స్ ఇన్స్పెక్టర్ సంగం వెంకట పుల్లయ్య తెలిపారు. కనుమ పండుగ సందర్భంగా రవాణా శాఖ భద్రాచలం యూనిట్ కార్యాలయంలో, జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలు–37లో భాగంగా కార్యాలయానికి వచ్చిన దరఖాస్తుదారులు, సాధారణ ప్రజలకు రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్రాంతి, కనుమ వంటి పండుగలు ప్రతి ఇంటా ఆనందం, ఉల్లాసాన్ని నింపే పర్వదినాలని పేర్కొన్నారు. ఈ పండుగల సంతోషాలు శాశ్వతంగా కొనసాగాలంటే రోడ్డు ప్రమాదాలు నివారించాల్సిన అవసరం ఉందని తెలిపారు. అందుకోసం వాహనదారులంతా రవాణా నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. యువత తమ కుటుంబాలకు మాత్రమే కాకుండా దేశ భవిష్యత్తుకు కూడా రక్షణగా నిలవాల్సిన బాధ్యత కలిగి ఉందని అన్నారు. యువత జీవితం అమూల్యమైందని, చిన్న నిర్లక్ష్యం కూడా కుటుంబాలకు తీరని విషాదాన్ని మిగిలిస్తుందని హెచ్చరించారు. కావున యువత రోడ్డు ప్రమాదాలకు కారకులుగా కాకుండా, రోడ్డు భద్రతకు రక్షకులుగా మారాలని పిలుపునిచ్చారు. రెండు చక్రాల వాహనదారులు తప్పనిసరిగా నాణ్యమైన హెల్మెట్ ధరించాలని, నాలుగు చక్రాల వాహనాల్లో సీట్‌బెల్ట్ వినియోగం అనివార్యమని తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదని, అతివేగం, సెల్‌ఫోన్ వినియోగం, నిర్లక్ష్యపు డ్రైవింగ్ ప్రాణాంతకమని స్పష్టం చేశారు. రోడ్డు భద్రత నిబంధనలు పాటించినప్పుడే కుటుంబాలు, సమాజం సురక్షితంగా ఉంటాయని అన్నారు. ఈ అవగాహన కార్యక్రమంలో అసిస్టెంట్ మోటార్ వెహికల్స్ ఇన్స్పెక్టర్ బి. రాజశేఖర రెడ్డి పాల్గొని, హాజరైన వారితో రోడ్డు భద్రతపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో రవాణా శాఖ సిబ్బంది భీముడు తదితరులు పాల్గొన్నారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా ఇలాంటి అవగాహన కార్యక్రమాలు ప్రజలలో మార్పు తీసుకువచ్చి రోడ్డు ప్రమాదాల నియంత్రణకు దోహదపడతాయని పాల్గొన్నవారు అభిప్రాయం వ్యక్తం చేశారు



- రోడ్డు ప్రమాదాలకు చెక్ పెట్టే ప్రయత్నం
- వేగం కాదు... భద్రతే ముఖ్యమని సందేశం
- జిల్లావ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు
- యువత, ద్విచక్ర వాహన దారులపై ప్రత్యేక దృష్టి
- భయంతో కాదు... బాధ్యతతో డ్రైవింగ్ కు పిలుపు
- తెలంగాణ పోలీస్ శాఖ అధ్వర్యంలో నూతన కార్యక్రమం



# అరైవ్... అలైవ్

**రోడ్డు భద్రతకు కొత్త పిలుపు**

గమ్యానికి చేరుకోవడం కాదు.. జీవంతో చేరుకోవడమే అసలైన విజయం అనే నినాదంతో పోలిస్ శాఖ ఆధ్వర్యంలో ఓ నూతన కార్యక్రమం కొనసాగుతోంది . రోడ్డు మీద రోజూ జరుగుతున్న ప్రమాదాలు ఎన్నో కుటుంబాలను శాశ్వతంగా కుదిపేస్తున్న నేపథ్యంలో, ప్రజల ప్రాణాలే కేంద్రంగా తెలంగాణ పోలీస్ శాఖ **'Arrive... Alive'** పేరుతో వినూత్న అవగాహన కార్యక్రమాన్ని ప్రారంభించింది. వేగం కాదు, భద్రతే ముఖ్యం అన్న సందేశాన్ని ప్రజల్లో బలంగా నాటడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం.

● భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ప్రజాజ్యోతి

రాష్ట్రంలో పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలు, ప్రాణనష్టాలను దృష్టిలో పెట్టుకుని రూపొందించిన ఈ కార్యక్రమాన్ని భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో జనవరి 13న సుజాతనగర్ కేంద్రంగా జిల్లా ఎస్పీ ప్రారంభించారు. తెలంగాణ వ్యాప్తంగా జనవరి 13 నుంచి 24 వరకు కొనసాగే ఈ అవగాహన కార్యక్రమంలో ప్రతిరోజూ ఒక వినూత్న సందేశంతో ప్రజలను చేరుకునేలా రాష్ట, జిల్లా పోలీసులు ప్రణాళిక రూపొందించారు.

**ప్రమాద కారణాలు.. ప్రచార ప్రదేశాలు..**

సమయానికి చేరుకోవాలన్న తొందర, నిర్లక్ష్య డ్రైవింగ్, మద్యం సేవించి వాహనం నడపడం, హెల్మెట్–సీట్ బెల్ట్ వినియోగంలో అలసత్వమే ఎక్కువ ప్రమాదాలకు కారణమవుతున్నాయని పోలీస్ శాఖ విశ్లేషిస్తోంది. అందుకే ఈ కార్యక్రమం భయపెట్టే హెచ్చరికలతో కాకుండా, బాధ్యతను గుర్తు చేసే సందేశంతో ముందుకు సాగుతోంది. "వేగంగా వెళ్లడం కాదు, సురక్షితంగా వెళ్లడం ముఖ్యం. ఆలస్యమైనా పరవాలేదు, కానీ జీవంతో ఇంటికి చేరాలి" అన్న ఆలోచనను ప్రజల్లో నాటడమే లక్ష్యమని పోలీసులు చెబుతున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా బ్లాక్ స్పాట్ ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించనున్నారు. గ్రామ స్థాయిలో సర్పంచ్ ల నేతృత్వంలో అవగాహన సమావేశాలు, ప్రభుత్వ శాఖల అధికారులతో చర్చలు, పాఠశాలలు – కళాశాలల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. విద్యార్థుల్లో ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన పెంచేందుకు పరీక్షలు, ఇంటరాక్టివ్ సెషన్లు చేపట్టనున్నారు. దీనితో పాటు మత్తు పదార్థాల వినియోగం, డ్రంక్ డ్రైవింగ్ పై ప్రత్యేక యాంటీ డ్రగ్స్ ప్రచారం కూడా కొనసాగనుంది.

**కొత్త చైతన్యానికి నాందిగా..**

ప్రత్యేకంగా యువత, ఉద్యోగులు, ద్విచక్ర వాహనదారులు, నైట్ డ్రైవింగ్ చేసే వర్గాలపై ఈ ప్రచారం దృష్టి సారించనుంది. రోడ్డు భద్రత అనేది వ్యక్తిగత విషయం మాత్రమే కాకుండా, కుటుంబాలు – సమాజాన్ని ప్రభావితం చేసే అంశమని పోలీసులు గుర్తు చేస్తున్నారు. ఒక్క ప్రమాదం వెనుక ఒక కుటుంబం జీవితమే తారుమారవుతుందన్న వాస్తవాన్ని ప్రజలు ఆలోచించాలని పిలుపునిస్తున్నారు. పాఠశాలలు, కళాశాలలు, కార్యాలయాలు, ప్రధాన రహదారులు, సోషల్ మీడియా వేదికల ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించి, 'Arrive... Alive'ను కేవలం నినాదంగా కాకుండా ప్రతి ప్రయాణికుడి బాధ్యతగా మార్చడమే లక్ష్యమని అధికారులు స్పష్టం చేస్తున్నారు. రోడ్డుపై అడుగుపెట్టిన ప్రతి ఒక్కరూ "నేను చేరుకోవాలి కాదు... జీవంతో చేరుకోవాలి" అని నిర్ణయించుకుంటేనే ప్రమాదాల సంఖ్య తగ్గుతుందని వారు అభిప్రాయపడుతున్నారు. ఈ దిశగా ఈ కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా కొత్త చైతన్యానికి నాందిగా మారనుందని పోలీస్ శాఖ భావిస్తోంది.





## చిన్న చిన్న తప్పిదాలే.. : రెహమాన్ (కొత్తగూడెం డీఎస్పీ)



"రోడ్డు ప్రమాదాలు యాదృచ్ఛికంగా జరగడం లేదు. మనమే చేస్తున్న చిన్న చిన్న తప్పిదాలే పెద్ద ప్రాణనష్టాలకు కారణమవుతున్నాయి. వేగంగా వెళ్లాలన్న ఆత్రుత, మద్యం సేవించి వాహనం నడపడం, హెల్మెట్–సీట్ బెల్ట్ ధరించకపోవడం వల్లే ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయి. గమ్యానికి చేరుకోవడం కాదు, జీవంతో ఇంటికి చేరుకోవడమే ముఖ్యం. అందుకే 'Arrive... Alive' కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తున్నాం. ఆలస్యమైనా పరవాలేదు కానీ సురక్షితంగా వెళ్లాలి. యువత, ద్విచక్ర వాహనదారులు ముఖ్యంగా బాధ్యతగా డ్రైవ్ చేయాలి"

## ప్రతి వాహనదారుడి బాధ్యత ; రవీందర్ రెడ్డి (మణుగూరు డీఎస్పీ)



"రోడ్డు భద్రత అనేది పోలీసుల పని మాత్రమే కాదు, ప్రతి వాహనదారుడి బాధ్యత. ఒక చిన్న నిర్లక్ష్యం వల్ల ఒక కుటుంబం మొత్తం జీవితాంతం బాధపడాల్సి వస్తుంది. హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించకపోవడం, నైట్ డ్రైవింగ్ లో జాగ్రత్తలు పాటించకపోవడం, మద్యం సేవించి వాహనం నడపడం వంటి అలవాట్లే ప్రమాదాలకు దారి తీస్తున్నాయి. 'Arrive... Alive' ద్వారా ప్రజల్లో భయాన్ని కాదు, బాధ్యతను పెంచాలని మేము కోరుకుంటున్నాం. ఆలస్యమైనా సరే, సురక్షితంగా ఇంటికి చేరాలి అన్న ఆలోచన ప్రతి ఒక్కరిలో ఉండాలి".

## ఎక్కువ శాతం మానవ తప్పిదాలే.. ; వెంకట రమణ (భద్రాద్రి జిల్లా రవాణా అధికారి)



"రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువ శాతం మానవ తప్పిదాలే కారణం. లైసెన్స్ ఉన్నా నిబంధనలు పాటించకపోవడం, వాహనాల నిర్వహణపై నిర్లక్ష్యం, హెల్మెట్–సీట్ బెల్ట్ ను లైట్ గా తీసుకోవడమే ప్రాణనష్టాలకు దారి తీస్తోంది. రోడ్డు భద్రత అనేది ఒక్క రోజు అవగాహనతో ముగిసే విషయం కాదు. 'Arrive... Alive' వంటి కార్యక్రమాల ద్వారా ప్రతి వాహనదారుడిలో క్రమశిక్షణ, బాధ్యత పెరగాలి. వాహనం నడిపేటప్పుడు మీరు మాత్రమే కాదు, మీ కుటుంబం కూడా మీతో ప్రయాణిస్తోందన్న భావన ఉండాలి".

## శాశ్వత అన్నదానానికి రూ.50 వేల విరాళం



భద్రాచలం, జనవరి 16,ప్రజా జ్యోతి : భద్రాచలంలోని శ్రీ సాయి బాబా మందిరంలో సంక్రాంతి పర్వ దినాన్ని పురస్కరించుకుని వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని ప్రత్యేక పూల అలంకరణతో సర్వాంగసుందరంగా ముస్తాబు చేశారు. పట్టణానికి చెందిన పరిటాల లక్ష్మీ–ఉదయ్ చంద్ర దంపతులు సాయిబాబా ఆలయంలో నిర్వహిస్తున్న నిత్య అన్నప్రసాద సేవకు శాశ్వతంగా రూ.50,000 విరాళంగా అందజేశారు. విరాళం అందించిన దాతలను ఆలయ కమిటీ సభ్యులు శాలువాలతో సత్కరించి, సాయిబాబా చిత్రపటాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కొమ్మనాపల్లి ఆదినారాయణ, వైస్ చైర్మన్ మాగంటి శ్రీనివాస వరప్రసాద్, కోశాధికారి గొర్ల వెంకటేశ్వరరావు, అర్చకులు శ్రీరామ్ శర్మతో పాటు కమిటీ సభ్యులు పాల్గొన్నారు

## మావోయిస్టుల డంప్ స్వాధీనం



చర్ల, జనవరి 16:(ప్రజా జ్యోతి ): ఛత్తీస్గఢ్ రాష్ట్రంలోని దంతేవాడ జిల్లాలోని బర్సూర్ పోలీస్ స్టేషన్ ప్రాంతంలోని పోలీసులు మావోయిస్టు ల డంప్‌ను విజయవంతంగా స్వాధీనం చేసుకున్నారు. జనవరి 13న, ఒక ఇన్ఫార్మర్ నుండి వచ్చిన సమాచారం ఆధారంగా, కుర్సింగ్‌బహార్ గ్రామ సమీపంలోని దట్టమైన అడవిలో సంయుక్తంగా సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఈ సోదాల్లో, భద్రతా దళాలు అడవిలో దాగి ఉన్న పెద్ద పేలుడు పదార్థాల డంప్‌ను కనుగొన్నాయి. అయితే ఈ ఆపరేషన్‌లో నక్సలైట్లను ఎవరూ అరెస్టు చేయలేదు. **స్వాధీనం చేసుకున్న డంప్:** శోధన ఆపరేషన్ సమయంలో దళాలు ఆ ప్రదేశాన్ని శోధించి నక్సలైట్లు దాచిపెట్టిన పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నాయి. స్వాధీనం చేసుకున్న పదార్థంలో మూడు పైపు బాంబులు ఉన్నాయి, ఒక్కొక్కటి 10 కిలోల బరువు, 5 కిలోల బరువున్న ప్రెషర్ కుక్కర్ ఐఈ డి ఉన్నాయి. అదనంగా, నాలుగు ఖాళీ ప్రెషర్ కుక్కర్లను కూడా స్వాధీనం చేసుకున్నారు. వేగంగా చర్య తీసుకొని బాంబు డిస్పోజల్ స్క్వాడ్ (బి డి ఎస్ ) సహాయంతో స్వాధీనం చేసుకున్న పేలుడు పదార్థాలన్నింటినీ సురక్షితంగా నిర్వీర్యం చేశారు. ఈ చర్య భద్రతా దళాలకు పౌరులకు ముప్పును నివారించింది.

# రోడ్డు భద్రత వారోత్సవాలు – ప్రజల ప్రాణరక్షణే లక్ష్యంగా అవగాహన కార్యక్రమం

♦ - మణుగూరు డిఎస్పి రవీందర్ రెడ్డి




పినపాక,జనవరి 16(ప్రజాజ్యోతి): రోడ్డు ప్రమాదాలను నివారించి ప్రజల ప్రాణాలను కాపాడటమే ప్రధాన లక్ష్యంగా రోడ్డు భద్రత వారోత్సవాల సందర్భంగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం పినపాక మండలం ఐలాపురం క్రాస్ రోడ్డు వద్ద శుక్రవారం నిర్వహించగా ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మణుగూరు డీఎస్పీ రవీందర్ రెడ్డి హాజరై మాట్లాడారు. రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా నిర్లక్ష్యం, ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘన వల్లే జరుగుతున్నాయని అన్నారు. వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్, సీట్‌బెల్ట్ ధరించాలన్నారు. మద్యం సేవించి వాహనం నడపడం అత్యంత ప్రమాదకరమని, ఇది కేవలం వాహనదారుడికే కాదు ఇతరుల ప్రాణాలకు కూడా ముప్పుగా మారుతుందని హెచ్చరించారు. వేగ నియంత్రణ పాటించడం, మొబైల్ ఫోన్ ఉపయోగించకుండా వాహనం నడపడం వంటి అంశాలు ప్రమాదాల నివారణలో కీలకమని వివరించారు. ముఖ్యంగా యువత ట్రాఫిక్ నియమాలపై అవగాహన పెంచుకుని బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎస్ఐ సురేష్ మాట్లాడుతూ, రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని చెప్పారు. పాదచారులు కూడా జాగ్రత్తలు పాటించాలని, రోడ్డు దాటేటప్పుడు రోడ్డు ఇరువైపులా చూసుకొని దాటాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లోనూ ట్రాఫిక్ నియమాలు పాటించడం అవసరమని అన్నారు. భూపాలపట్నం సర్పంచ్ స్వప్న మాట్లాడుతూ, గ్రామస్థాయిలోనూ రోడ్డు భద్రతపై విస్తృత ప్రచారం చేయాల్సిన అవసరం ఉందన్నారు. పొట్లపల్లి సర్పంచ్ మద్దెల సమ్మయ్య, గడ్డంపల్లి సర్పంచ్ పడిగా కృష్ణవేణి మాట్లాడుతూ, స్థానిక సంస్థలు పోలీస్ శాఖతో కలిసి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తే ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని అభిప్రాయపడ్డారు. ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ, మీడియా కూడా రోడ్డు భద్రతపై ప్రజల్లో చైతన్యం తీసుకురావడంలో కీలక పాత్ర పోషించాలన్నారు. నిత్యం ప్రమాదాలపై వార్తలు ప్రచురించడంతో పాటు నివారణ చర్యలపై అవగాహన కల్పించాల్సిన బాధ్యత ఉందని చెప్పారు. అనంతరం ప్రమాదంలో మరణించిన వారి కుటుంబ సభ్యులతో మాట్లాడించారు. రోడ్డు ప్రమాదాలలో ఒక వ్యక్తి మరణించడం అంటే ఆ కుటుంబం రోడ్డున పడ్డట్టే అని తెలిపారు. ఈ కార్యక్రమంలో బాధితులు కన్నీరు పెట్టుకుంటూ తమ ఆవేదన తెలియజేశారు. తమ కుటుంబంలో జరిగిన ఘటన ఇంకా ఏ కుటుంబంలో జరగవద్దని వారు ఈ సందర్భంగా తమ ఆవేదన ద్వారా తెలియజేశారు. కార్యక్రమం ద్వారా రోడ్డు భద్రతపై ప్రజల్లో చైతన్యం పెరిగిందని నిర్వాహకులు తెలిపారు. రాబోయే రోజుల్లో ఇలాంటి కార్యక్రమాలను మరిన్ని ప్రాంతాల్లో నిర్వహిస్తామని పోలీసులు వెల్లడించారు. అనంతరం డిఎస్పి రోడ్డు భద్రతపై ప్రతిజ్ఞ చేయించారు.ఈ అవగాహన సమావేశంలో స్థానిక ప్రజలు, వాహనదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## విద్యతోనే జీవితాలకు వెలుగులు

♦ డివిజన్ యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు పెద్దిరెడ్డి




చర్ల, జనవరి 16:(ప్రజాజ్యోతి): చర్లలో శుక్రవారం మాజీ రాజ్యసభ సభ్యులు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రాపోలు ఆనంద భాస్కర్ జన్మదినం పురస్కరించుకొని పెద్దిరెడ్డి ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా చర్లలోని వనవాసీ కళ్యాణ పరిషత్ కొమరం భీం విద్యార్థి నిలయంకు 75 కేజీల బియ్యం, అంబేద్కర్ నగర్ కు చెందిన మానసిక వికలాంగురాలి కుటుంబానికి 25 కేజీల బియ్యం వితరణగా అందచేసారు. వనవాసీలో జరిగిన కార్యక్రమంలో పెద్దిరెడ్డి మాట్లాడుతూ ఆనంద భాస్కర్ జన్మదినం సందర్భంగా వితరణను అందచేయడం సంతోషకరమని మారుమూల గ్రామాలకు చెందిన నిరుపేద విద్యార్థులకు వసతి కల్పించి వారి ఉన్నతికి వనవాసీ కృషిచేయడం అబినందనీయమని అన్నారు. భవిష్యత్తు లో సంస్థకు సహాయ సహకారాలను అందచేసేందుకు సిద్ధమని పేర్కొన్నారు. విద్యార్థుల జీవితాలు చదువుల ద్వారానే బాగు పడతాయని నేడు మన కళ్లముందు అనేకమంది ఉన్నత విద్యను అభ్యసించి మంచి స్థితిలో ఉన్నవారి అనేక ఉదాహరణలు ఉన్నాయని వారిని ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. వనవాసీ గౌరవ సలహాదారులు బివిఎస్ఎల్ నర్సింహారావు మాట్లాడుతూ గిరిజనులలోని నిరుపేదలకు ప్రయోజనం కలిగించేందుకు వనవాసీ ఏర్పడ్డదని వారి అభ్యున్నతికి కృషి చేస్తూ జీవితాలలో మార్పు తెచ్చేందుకు ప్రయత్నం చేస్తోందని అన్నారు . గిరిజన విద్యార్థులను ఉత్తములుగా తీర్చిదిద్ది సమాజానికి ఉపయోగపడేలా తయారు చేయడమే సంస్థ లక్ష్యమని సంస్థ ప్రభుత్వాల నుండి ఎటువంటి సహాయ సహకారాలను తీసుకోదని, కేవలం దాతల సహకారంతోనే నడుస్తుందని స్పష్టం చేసారు. సంస్థకు వెన్నుదన్నుగా నిలిచేందుకు మరింత మంది దాతలు ముందుకు వచ్చి పేద విద్యార్థుల చదువులకు అండగా నిలవాలని అన్నారు . కార్యక్రమంలో వనవాసీ కొమరం భీం విద్యార్థి నిలయం అధ్యక్షుడు తాటి పాపారావు, కార్యదర్శి జవ్వాది మురళీకృష్ణ, ఉపాధ్యక్షుడు గోగికార్ రాంలక్ష్మణ్, సహ కోశాదికారి వేములపల్లి ప్రవీణ్ బాబు, కమిటీ సభ్యులు శివరాజు కిషోర్, లవన్ కుమార్ రెడ్డి, మద్ది లక్ష్మి నరసింహారెడ్డి పాల్గొన్నారు.

## మైనార్టీ గురుకులాల్లో ఆన్ లైన్ అడ్మిషన్లు ప్రారంభం

భద్రాచలం, జనవరి 16,ప్రజాజ్యోతి : జిల్లాలోని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ మైనార్టీ గురుకులాల్లో 2026–27 విద్యా సంవత్సరానికి గాను అడ్మిషన్ల కోసం ఆన్ లైన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ శుక్రవారం క్యాంప్ కార్యాలయంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ముస్లిం మైనార్టీలు తమ పిల్లలను మైనార్టీ గురుకుల పాఠశాలల్లో ఐదవ తరగతితో పాటు ఇంటర్ మొదటి సంవత్సరంలో చేర్పించుకోవాలని సూచించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో కొత్తగూడెంలో బాలికల, బాలుర గురుకులాలు, బూర్గంపాడులో బాలికల గురుకులం, భద్రాచలంలో బాలుర గురుకులం, అశ్వారావుపేటలో బాలికల గురుకులం, ఇల్లందులో బాలికల గురుకులాల్లో ఐదవ తరగతి మరియు ఇంటర్ మొదటి సంవత్సరంలో ముస్లిం మైనార్టీ విద్యార్థులకు ప్రవేశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం మైనార్టీల విద్యావకాశాల విస్తరణ కోసం ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేసిన గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో నాణ్యమైన ఉచిత విద్య, వసతి, భోజన సదుపాయాలు అందిస్తున్నాయని పేర్కొన్నారు. అర్హులైన విద్యార్థులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా మైనార్టీ సంక్షేమాభివృద్ధి అధికారి కె. సంజీవరావు, ఉమ్మడి ఖమ్మం జిల్లా ఆర్ ఎల్ సీ సభ్యురాలు ఎం.జే. అరుణ కుమారి, ఉమ్మడి ఖమ్మం జిల్లా విజిలెన్స్ అధికారులు కె. సీతారాములు, ఎం.ఏ. రవూఫ్ పాల్గొన్నారు. అలాగే జిల్లాలోని మైనార్టీ గురుకుల పాఠశాలలు, కళాశాలల ప్రిన్సిపాళ్లు, కార్యాలయ సిబ్బంది హాజరయ్యారు. మైనార్టీ గురుకులాల్లో అందిస్తున్న నాణ్యమైన ఉచిత విద్యపై అవగాహన కల్పించేందుకు అడ్మిషన్ల ప్రచార సాధనంగా సీతారాములు రచించిన ఆడియో, వీడియో గీతాలను జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి కార్యాలయంలో ప్రారంభించారు.

## ప్రజలకు ప్రభుత్వానికి వారధి ప్రజా జ్యోతి దినపత్రిక

♦ క్యాలెండర్ ను ఆవిష్కరించిన ఎస్సై, ఎంపీడీవో



బూర్గంపహాడ్, జనవరి 16 (ప్రజా జ్యోతి): సమాజ హితం కోసం పాటుపడడంలో పత్రికలదే ప్రధాన పాత్ర అని బూర్గంపహాడ్ మండల ఎంపీడీవో జమలా రెడ్డి అన్నారు. బూర్గంపహాడ్ మండల ఎస్సై మెడ ప్రసాద్, ఎంపీడీవో జమలా రెడ్డి శుక్రవారం ప్రజా జ్యోతి నూతన సంవత్సర క్యాలెండర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజాస్వామ్య దేశంలో మీడియా కీలక పాత్ర పోషిస్తుందన్నారు. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిల పనిచేస్తూ ప్రజల సమస్యలపై పోరాటంలో ప్రజా జ్యోతి పత్రిక ప్రధాన పాత్ర పోషిస్తుందని ఆకాంక్షించారు. నిజాయితీగల వార్త ప్రచారం చేస్తూ ప్రజల్లో చైతన్యం తేవాలని తెలిపారు. ప్రధానంగా ఏజెన్సీ ప్రాంత ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రజా జ్యోతి కథనాలు అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ ఎస్ఐ దేవ్ సింగ్, సూపరింటెండ్ రవీంద్రబాబు, సీనియర్ పాత్రికేయులు బిజ్జం వెంకటరామిరెడ్డి, ప్రజా జ్యోతి రిపోర్టర్ సురేష్, శ్రీనివాసచారి, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

# 24 కిలోల ఐఈడీలు నిర్వీర్యం





**చర్ల, జనవరి 16:(ప్రజా జ్యోతి ):** ఛత్తీస్గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్ ప్రాంతాలలో నిర్వహించిన భారీ సోదాల సందర్భంగా భద్రతా దళాలు మావోయిస్టులు దాచిపెట్టిన నాలుగు ఇంప్రూవైజ్డ్ ఎక్స్ప్లోజివ్ డివైజ్‌లను (ఐ ఈ డి లు) స్వాధీనం చేసుకున్నాయి.వాటి బరువు మొత్తం 24 కిలోగ్రాములు. ఈ శక్తివంతమైన పేలుడు పదార్థాలను సురక్షితంగా నిర్వీర్యం చేయడంతో, పెద్ద ముప్పు తప్పింది. అదనంగా మావోయిస్టులు ఉపయోగించే రేషన్ సామాగ్రితో నిండిన రెండు తెల్ల డ్రమ్ములను కూడా స్వాధీనం చేసుకున్నారు.

**మద్దీద్ పోలీస్ స్టేషన్ ప్రాంతంలో రెండు పెద్ద ఐఈడి ల నిర్వీర్యం:**

పోలీసుల నుండి అందిన సమాచారం ప్రకారం, మద్దీద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సోమన్‌పల్లి బందేపారా మధ్య ఉన్న మట్టి రోడ్డుపై మావోయిస్టులు రెండు పెద్ద ఐ ఈ డి లను దాచిపెట్టారు. ప్రతి ఐ ఈ డి 10 కిలోల బరువు ఉంటుంది వరుసగా అమర్చబడింది. మద్దీద్ పోలీస్ స్టేషన్ పోలీసులు బాంబు డిస్పోజల్ స్క్వాడ్ (బి డి ఎస్ ) సంయుక్త బృందం ఈ రెండు ఐ ఈ డి లను స్వాధీనం చేసుకుంది. బీజాపూర్ బి డి ఎస్ బృందం భద్రతా ప్రమాణాలను అనుసరించి అక్కడికక్కడే వాటిని సురక్షితంగా నిర్వీర్యం చేసింది.

**భోపాల్పట్నం అడవి నుండి ప్రెజర్ ఐ ఈ డి లు , రేషన్లు స్వాధీనం:**

భోపాల్పట్నం పోలీస్ స్టేషన్ పరిధిలోని కొండపద్దు అడవిలో సి ఆర్ పీ ఎఫ్ యొక్క 214వ బెటాలియన్ జిల్లా పోలీసు దళం సంయుక్త బృందం నిర్వహించిన శోధన మందుపాతర తొలగింపు ఆపరేషన్‌లో ఒక పెద్ద పురోగతిని సాధించింది. కండ్లపర్తి క్యాంప్ 2 సమీపంలో జరిగిన శోధనలో, బృందం 2 కిలోగ్రాముల బరువున్న రెండు ప్రెజర్ ఐ ఈ డి లను స్వాధీనం చేసుకుంది. సి ఆర్ పీ ఎఫ్ 214వ బెటాలియన్ యొక్క బి డి డి బృందం వేగంగా పనిచేసి ఈ ప్రెజర్ ఐ ఈ డి లను అక్కడికక్కడే నిర్వీర్యం చేసింది. శోధన ఆపరేషన్ సమయంలో, మావోయిస్టులు భూగర్భంలో ఒక గొయ్యిలో దాచిపెట్టిన రెండు తెల్ల డ్రమ్‌లను కూడా స్వాధీనం చేసుకున్నారు. ఈ డ్రమ్స్‌లో మావోయిస్టులకు రేషన్ ఇతర అవసరమైన సామాగ్రి ఉన్నాయి వీటిని వారు తమ కార్యకలాపాలలో ఉపయోగించారు. ఈ రికవరీలు మావోయిస్టు కార్యకలాపాలను వాటి సరఫరా అరికట్టడంలో సహాయపడతాయి అని అధికారులు భావిస్తున్నారు

## రోడ్డు నిబంధనలు పాటించి ప్రమాదాలను అరికట్టండి

◆ సీఐ బత్తుల సత్యనారాయణ




**టేకులపల్లి,జనవరి16,ప్రజాజ్యోతి :** రోడ్డు నిబంధనలు పాటించి ప్రమాదాలను అరికట్టేందుకు కృషి చేయాలని ప్రతి ఒక్క వాహనదారుడికి సీఐ బత్తుల సత్యనారాయణ సూచించారు. టేకులపల్లి మండల పరిధిలోని సులానగర్ ప్రాథమిక వైద్యశాల లో డాక్టర్ దినేష్ ఆధ్వర్యంలో శుక్రవారం టేకులపల్లి సీఐ బత్తుల సత్యనారాయణ అరైవ్.. అలైవ్ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హెల్మెట్ వినియోగం,సీటు బెల్ట్ ప్రాధాన్యత,డిఫెన్సివ్ డ్రైవింగ్ నియ మాల గురించి వివరించారు.డ్రైవింగ్లో స్వీయ క్రమశిక్షణ ఉంటే రోడ్డు ప్రమాదాలను అరికట్టవచ్చ న్నారు. రోడ్డుపై విధులలో పోలీసులు ఉన్నా, లేక పోయినా నిబంధనలను పాటించాలని కోరారు. వాహనదారులు అతివేగం ప్రమాదకరమని గుర్తించాలని, మద్యం సేవించి, సెల్ఫోన్లు తో మాట్లాడుతూ వాహనాలు నడపరాదని హెచ్చరికలు జారీ చేశారు. వాహనాలు నడిపే వ్యక్తులకు ఓ కుటుంబం ఉందన్న విషయాన్ని గుర్తించుకొని ముందుకెళ్లాలన్నారు. రాంగ్ రూట్, సిగ్నల్ జంపింగ్, ఓవర్ లోడ్ వలన కలిగే ప్రమాదాల గురించి వివరించారు. డాక్టర్ దినేష్ మాట్లాడుతూ వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించి, క్షేమంగా ఇంటికి చేరాలన్నారు. అనంతరం సులానగర్ ప్రాథమిక వైద్యశాలలో పేషంట్లతో ప్రతిజ్ఞ చేయించారు.ఈ కార్యక్రమం లో సులానగర్ ప్రాథమిక వైద్యశాల డాక్టర్ దినేష్,స్టాఫ్, పేషంట్స్,పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## మండలంలో మట్టి దందా..!

- - పర్మిషన్లతో పనిలే.. హెచ్చరికలకు తగ్గేదే లే..
- - రాత్రి వేళల్లో అనధికారిక మట్టితోలకాలు..
- - ప్రధాన రహదారి పక్కనే డంపింగ్.. చూసి చూడనట్లు వ్యవహరిస్తున్న రెవెన్యూ మైనింగ్ శాఖలు



**బూర్గంపహాడ్ జనవరి 16 (ప్రజాజ్యోతి):** బూర్గంపహాడ్ మండల పరిధిలోని మేజర్ పంచాయతీ సారపాకతో పాటు మండల కేంద్రమైన బూర్గంపహాడ్, లక్ష్మీపురం, కృష్ణ సాగర్, మొరంపల్లి బంజర్ తదితర ప్రాంతాలలో అనధికారిక మట్టితోలకాలు రాత్రి వేళల్లో విచ్చలవిడిగా నడుస్తున్నాయని మండల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గత రాత్రి పాత సారపాక ప్రాంతంలోని ఓ దాబా పక్కన ఖాళీ స్థలంలో టిప్పర్లతో అనుమతి లేని మట్టి తోలకాలు నిర్వహించారు కొందరు అక్రమార్కులు.కాగా అనుమతి లేని అక్రమ మట్టి, ఇసుక రవాణా ను కట్టడి చేయడంలో మండలంలోని ఆయా శాఖల అధికారులు విఫలం అవుతున్నారా..? లేక తెలిసి తెలియనట్లు మౌనం వహిస్తున్నారా..? అనే చర్చ మండల వ్యాప్తంగా నడుస్తుంది. అధికారులకు తెలియకుండా అక్రమంగా నిర్వహించే రవాణాలు ఈ విధంగా దర్జాగా ప్రధాన రహదారులపై బరితెగించి చేస్తారా..! అధికారులు అండతోనే ఈ అక్రమ రవాణా జరుగుతుందని విమర్శలు ఆయా శాఖల అధికారులకు చెడ్డ పేరుని తీసుకువస్తున్నాయి. విమర్శలు వచ్చినా సహిస్తున్నారే కానీ.., అక్రమ మట్టి ఇసుక రవాణాను కట్టడి చేయడంలో మాత్రం అధికారులు చర్యలు తీసుకోవడం లేదంటూ స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఒకవైపు సీతారామ ప్రాజెక్టు నుండి అక్రమ మట్టి రవాణా జరుగుతుందని ఎన్నో రోజులుగా వార్తలు, సోషల్ మీడియా గ్రూపులలో చర్చలు జరుగుతూనే ఉన్నాయి. అయినప్పటికీ అసలు సీతారామ ప్రాజెక్టు నుండి ఎంత మట్టిని ఎవరు తీసుకుపోతున్నారు.. అధికారికంగా అక్కడ ఉండవలసిన మట్టి ఎంత ఇప్పుడు ఎంత ఉన్నది అనే విషయంపై సైతం స్థానికులు సందేహం వ్యక్తం చేస్తున్నారు. కొందరు అధికారుల లాలూచీ వల్లనే అక్రమ వ్యాపారం చేసేవారు ఇంత బరితెగించి దర్జాగా రోడ్లపై టిప్పర్లు లారీలతో అనుమతి లేని మట్టిని తరలిస్తూ జేబులు నింపుకుంటున్నారని స్థానికులు మండిపడుతున్నారు. ఇకనైనా మండలంలోని అధికారులు ఏజెన్సీ చట్టాలకు కాపాడాలని, అక్రమ మట్టి, ఇసుక రవాణా ను కాపాడాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

## పెద్దమ్మ తల్లికి___ కాశీ విశ్వేశ్వర స్వామి వారికి ఘనంగా పంచామృతాభిషేకం





**పాల్వంచ ,:కొత్తగూడెం కలెక్టరేట్: జనవరి 16: ప్రజా జ్యోతి** పాల్వంచ మండల పరిధిలోని పెద్దమ్మ తల్లి అమ్మవారికి పంచామృతముతో ఘనంగా ఆలయ అర్చకులు పంచామృతాభిషేకం పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు, ముందుగా జన్మ స్థలం వద్ద ఉన్న అమ్మవారికి పసుపు కుంకుమ గాజులు హారతి సమర్పించి న అనంతరం ఆలయంలోని అమ్మవారి మూల విరాటకు పంచామృతములతో వైభవంగా పంచామృతాభిషేకం పూజా కార్యక్రమం నిర్వహించారు, అనంతరం అమ్మవారికి నీరాజనం నివేదన నీరాజనం మంత్రపుష్పం తదితర పూజలు చేశారు ,ఈ సందర్భంగా భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు, అదేవిధంగా ఆలయ ప్రాంగణంలోని అన్నపూర్ణాదేవి సమేత కాశి విశ్వేశ్వర స్వామి ఆలయంలో ఆరుద్ర నక్షత్రంతో కూడిన మాస శివరాత్రి సందర్భంగా ప్రదోష కాలంలో నందీశ్వర స్వామి వారికి పంచామృతములతో ఘనంగా అభిషేకం, అష్టోత్తర శతనామార్చిన పూజా కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు, ఆలయ ఈవో రజనీకుమారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త మండలి సభ్యులు, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు

## మద్యానికి బానిసైన వ్యక్తి మృతి



**పాల్వంచ, కొత్తగూడెం కలెక్టరేట్ ,జనవరి 16, ప్రజా జ్యోతి** అతిగా మద్యం సేవించి బార్ షాప్ ఎదుట ఒక వ్యక్తి మృతి చెందిన సంఘటన శుక్రవారం పాల్వంచలో జరిగింది, ఇందుకు సంబంధించిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి, కొత్తగూడెం లక్ష్మీదేవి పల్లి మండలం ప్రశాంతి నగర్ కు చెందిన తెలకలపల్లి సమ్మయ్య(38) పాత ఇనుము వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు, ఈ క్రమంలో ఈ నెల 11న పాత ఇనుము వ్యాపార నిమిత్తం పాల్వంచకు చేరుకున్న సమ్మయ్య పట్టణంలోని ఒక బార్ షాప్ కి వెళ్లి అతిగా మద్యం సేవించగా సమ్మయ్యకు ఒక్కసారిగా గుండెపోటు రావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు, ఈ విషయాన్ని వాట్సాప్ యజమాని స్థానిక పోలీసులకు తెలియపరచగా సంఘటన స్థలానికి చేరుకున్న పట్టణ ఎస్ఐ సుమన్ మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ వైశ్యలకు తరలించి ఆచూకీ కోసం సమ్మయ్య మృతదేహ ఫోటోను వాట్సాప్ గ్రూపులో సెండ్ చేశారు, ఇదిలా ఉండగా ఈనెల 11న ఇంటి నుండి బయటకు వచ్చిన సమ్మయ్య ఇంటికి తిరిగి రాకపోవడంతో తన భార్య భాగ్య ఎదురుచూస్తున్న క్రమంలో వాట్సాప్ గ్రూప్ లో వచ్చిన తన భర్త సమ్మయ్య ఫోటో శుక్రవారం వచ్చిందని తెలుసుకొని పాల్వంచ ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకుంది, సమ్మయ్య భార్య మాట్లాడుతూ తన భర్త కొన్ని నెలల నుండి ఇంటికి రావడంలేదని, తన భర్త మద్యానికి బానిసై మరణించాడని, తన భర్త మరణం పై ఎలాంటి అనుమానాలు లేవని పోలీసులకు తెలిపిన ఫిర్యాదులు పేర్కొంది, ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు మృతునికి భార్య ఇద్దరు పిల్లలు శ్వేత వంశీ,లు ఉన్నారు

## అన్నపురెడ్డిపల్లిలో దశాబ్ది ఉత్సవాలు ఘనంగా ముగింపు

- * జనవరి 13 నుంచి 15 వరకు జరిగిన వివిధ పోటీల్లో గెలుపొందిన వారికి శుక్రవారం బహుమతుల అందజేత
- * హరిహర ఫౌండేషన్ స్థాపకుడు మార్గాని శ్రీనివాస రావు ఆధ్వర్యంలో భారీ మహా అన్నదానం







**అన్నపురెడ్డిపల్లి, జనవరి 16, ప్రజా జ్యోతి:** అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలో గల అంకమ్మ తల్లి ఆలయం ప్రాంగణంలో మండల దశాబ్ది ఉత్సవాలలో భాగంగా జనవరి 13 నుంచి 15 వరకు నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన వ్యక్తులకు శుక్రవారం బహుమతులు ప్రధానం చేశారు. ఈ పోటీల్లో పాల్గొన్న మిగతా వారందరికీ కన్సలైటేన్సీ బహుమతులు కూడా అందజేశారు. ఈ మూడు రోజుల పాటు వ్యాసరచన, వాలీబాల్, భక్తి పాటలు, డిబేట్, ముగ్గుల పోటీలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించగా ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. పిల్లలు, యువత, మహిళలు పెద్ద సంఖ్యలో ఈ పోటీల్లో పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. కార్యక్రమాల ముగింపులో హరిహర ఫౌండేషన్ స్థాపకుడు మార్గాని శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సుమారు 2000 మందికి పైగా భారీగా మహా అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ అన్నదాన కార్యక్రమం గ్రామ ప్రజల ప్రశంసలు పొందింది. ప్రత్యేకించి ఈ కార్యక్రమాన్ని ముందుండి నడిపించిన అన్నపురెడ్డిపల్లికి స్థానికులు, ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న చల్లా భాస్కర్, పర్సా వెంకటేశ్వరరావు ఈ కార్యక్రమాల కోసం ప్రత్యేకంగా హాజరయ్యారని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా వారిని మార్గాని శ్రీనివాసరావు ప్రత్యేకంగా సత్కరించారు. అలాగే ఈ నాలుగు రోజుల పాటు కార్యక్రమాల నిర్వహణలో కష్టపడ్డ ప్రతి ఒక్కరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలుపుతూ వారికి కూడా చిరు సత్కారం చేశారు. దశాబ్ది ఉత్సవాలు విజయవంతంగా ముగియడంలో మార్గాని శ్రీనివాసరావు కీలక పాత్ర పోషించారని ప్రజలు పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలు కొనసాగించాలని గ్రామ పెద్దలు ఆయనను కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లాకావత్ లక్ష్మి, ఉపసర్పంచ్ మార్గాని అశోక్, ప్రజాప్రతినిధులు, యూత్ సభ్యులు, అంకమ్మ తల్లి ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, ప్రముఖులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. దశాబ్ది ఉత్సవాల సందర్భంగా గ్రామంలో నాలుగు రోజుల పాటు పండుగ వాతావరణం నెలకొంది.

## విజేతలకు బహుమతులు అందజేత



**టేకులపల్లి, జనవరి 16, ప్రజాజ్యోతి:** మండలంలోని దాసు తండా గ్రామపంచాయతీలో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ముగ్గుల పోటీ, క్రీడాపోటీల్లో విజేతలకు శుక్రవారం సర్పంచ్ భూక్య చందర్ సింగ్ రాథోడ్ బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ యువత క్రీడలలో ఎప్పుడు చురుక్కా ఉంటూ అన్ని క్రీడలలో పాల్గొంటు ఉన్నత స్థాయిలకు ఎదగాలని, గెలుపు ఓటములు సహజమేనని అన్నింటిని క్రీడా స్ఫూర్తితో తీసుకోవాలని అన్నారు.నా సహకారం మీకు ఎల్లప్పుడు ఉంటుందిఅని అన్నారు. ఆపదలో ఉన్నప్పుడు మీ వెన్నంటే ఉంటానని, మీకు సేవా చేస్తూ మన గ్రామ పంచాయతీని అభివృద్ధి చేసుకుందాం అని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో భూక్య ఈశ్వర్ భూక్య కుమార్ గుగులోత్ నంద యువకులు పంచాయతీ నాయకులు తండా పెద్దలు, యువకులు పాల్గొన్నారు.


# ఉపాధ్యాయుని కుటుంబానికి టిఎస్ యుటిఎఫ్ ఆర్థిక సాయం





**టేకులపల్లి, జనవరి 16, ప్రజాజ్యోతి:** ఇటీవల గుండె పోటుతో మృతి చెందిన గుగులోత్ లక్ష్మణ్ ఉపాధ్యాయుడి కుటుంబానికి టిఎస్ యుటిఎఫ్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా శాఖ ఆధ్వర్యంలో 6 లక్ష రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా టీఎస్ యుటిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు చావా దుర్గ భవాని పాల్గొని ఈ సందర్భం గా మాట్లాడుతూ టీఎస్ యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా మరణించిన టీఎస్ యుటిఎఫ్ కుటుంబ సంక్షేమ సొసైటీ సభ్యు లకు మూడు కోట్లకు పైగా సంఘీభావ విరాళాలు అందజేయడం జరిగిందని తెలిపారు. ఒక సామాజిక స్పృహ కలిగిన సంఘంగా తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఈ పథకమును అత్యంత పారదర్శకంగా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఒక్కరి కోసం అందరం– అందరి కోసం ఒక్కరు అనే నినాదంతో ఈ పథకం ప్రారంభించి రెండున్నర సంవత్సరాలు పూర్తయినదని తెలిపారు. అనుకోని సంఘటనల వలన మరణించిన వారి కుటుంబాలకు ఆరు లక్షల రూపాయలు,వారికి ప్రభుత్వం నుండి రావలసిన ఆర్థిక సహాయం వచ్చేవరకు వారి కుటుంబ పోషణకు ఎంతగానో ఉ ప యోగ ప డుతున్నాయ ని తెలిపారు.ప్రస్తుతం ఆకస్మికంగా చనిపోయిన లేదా పదవి విరమణ పొందిన ఉపాధ్యాయుల ఉద్యోగులకు రావలసిన ప్రభుత్వ సహాయం వెంటనే రాని సందర్భం ఉన్నదని తెలిపారు. అదేవిధంగా ప్రస్తుతం ఉపాధ్యాయ ఉద్యోగులు ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న పిఆర్సి 2023ను మంచి ఫిట్మెంట్తో వెంటనే ప్రకటించాలని, పెండింగ్లో ఉన్నటువంటి ఐదు డిఏలను వెంటనే ప్రకటించాలని ,ఉపాధ్యాయులకు సంబంధించిన పెండింగ్ బిల్లులు వెంటనే వారి ఖాతాలలో జమ చేయాలని అన్నారు. పదవి విరమణ చెందిన వారి బకాయిలు వెంటనే చెల్లించాల ని, ఉ పాధ్యాయుల కు సంబంధించిన జిపిఎఫ్, టీఎస్జిఎల్ఐ,జిఐఎస్ వంటి వంటివి గత రెండు సంవత్సరాల కాలంగా పెండింగ్లో ఉన్నాయని వెంటనే జమ చేయాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేటు పాఠశాలలకు దీటుగా తరగతిగ ఉపాధ్యాయుడు ఉండే విధంగా తగు చర్యలు తీసుకొని అభివృద్ధి పరచాలని కోరారు. నూతన విద్యా విధానం 2020 ని ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా మార్పులు చేయాలని కోరారు.2010 కి ముందు నియామకమైన వారిని ఉపాధ్యాయ అర్హత పరీక్ష టెట్ నుండి మినహాయించాలని కోరారు.ఈ కార్యక్రమంలో టేకులపల్లి మండల విద్యాశాఖ అధికారి ఏ. జగన్, రాష్ట్ర కార్యదర్శి బి.రాజు, జిల్లా అధ్యక్షులు బి.మురళీ మోహన్, జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లంపాటి వెంకటేశ్వర్లు,జిల్లా ఉపాధ్యక్షులు వి. వరలక్ష్మి,ఎం, రాజయ్య, జిల్లా కోశాధికారి ఎస్.వెంకటేశ్వర్లు, రాష్ట్ర ఎఫ్ డబ్ల్యూ ఎస్ జాయింట్ సెక్రెటరీ ఎన్ .కృష్ణ జిల్లా కార్యదర్శిలు హాథిరాం, పి జయరాజు, ఎం పద్మా రాణి ,ఎస్ కే పాషా, డి తావూర్యా, రాష్ట్ర కమిటీ సభ్యులు బి కిషోర్ సింగ్, టేకులపల్లి మండల బాధ్యులు డి.హరి, టి.లక్ష్మణ్ ఇల్లెందు మండల బాధ్యులు ఈ. రాంబాబు,కే.వెంకటేశ్వర్లు, ఎఫ్ డబ్ల్యూ ఎఫ్ కన్వీనర్ బి. రామచందర్, జిల్లా సోషల్ మీడియా సభ్యులు బి. మంగీలాల్, జిల్లా కమిటీ సభ్యులు ఏ.వీరన్న,గుండాల మండల బాధ్యులు రూప్సింగ్, సభ్యులు భానుప్రియ తదితరులు పాల్గొన్నారు.

# రామయ్యకు వైభవంగా విశ్వరూప సేవ






- సర్వదేవతాలంకరణ దర్శనానికి భక్తుల నీరాజనం

**భద్రాచలం, జనవరి 16, ప్రజాజ్యోతి :** భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి వారికి విశ్వరూప సేవను వైభవోపేతంగా నిర్వహించారు. ముక్కోటి ఏకాదశి ఉత్సవాలు ముగిసిన అనంతరం వచ్చే 16వ రోజు బహుళ ద్వాదశి సందర్భంగా ఈ వేడుకను నిర్వహించడం భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో ఆనవాయితీగా కొనసాగుతున్న సంప్రదాయం. సంవత్సరకాల పూజల్లో దోషాలు దొర్లినట్లయితే వాటికి ప్రాయశ్చిత్తంగా శ్రీ సీతారామ లక్ష్మణులతో పాటు ఆలయ ప్రాంగణంలోని ఉపాలయాల్లో ఉన్న 108 మంది అర్చనామూర్తులను ఒకేచోట చేర్చి ఏకకాలంలో సేవ నిర్వహించడమే ఈ వేడుక ప్రత్యేకత. ముక్కోటి ఏకాదశి రోజున స్వామివారిని దర్శించుకోలేని భక్తులు, ముక్కోటి దేవతలు కొలువై ఉన్న విశ్వరూప సేవను దర్శించుకుంటే అదే పుణ్యఫలం లభిస్తుందని భక్తుల విశ్వాసం. ఈ సందర్భంగా స్వామివారి ఉత్సవమూర్తులను గర్భగుడి నుంచి మంగళవాయిద్యాల నడుమ బేడా మండపానికి తీసుకువచ్చి కొలువుదీర్చారు. అనంతరం సువర్ణ పుష్ప పూజ, వేద విన్నపాలు, దండ దీపాంజలి, హారతి, అష్టోత్తర శతనామార్చన వంటి విశేష పూజాకార్యక్రమాలు నిర్వహించారు. తరువాత స్వామివారికి ప్రత్యేక కదంబ ప్రసాదాన్ని నివేదించారు. విశ్వరూప సేవ అనంతరం భక్తులు ప్రసాదాన్ని స్వీకరించి గర్భగుడిలో స్వామివారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఈవో కె. దామోదర్‌రావు దంపతులు, ప్రధమశ్రేణి న్యాయాధికారి శివనాయక్, ఐటీడీఏ పీవో బి. రాల్ దంపతులు, దేవస్థానం వైదిక, పరిపాలన సిబ్బంది పాల్గొన్నారు



